క్లుప్తంగా

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కొత్తూరు: పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు మాస్టర్ శివకుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి పతకాలు, షీల్డులు సాధించినట్లు వివరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కేశంపేట జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల బహుమతులు ప్రదానం చేసినట్లు వెల్లడించారు.

జేపీదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మైనార్టీ నాయకులు

కొత్తూరు: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వలో ఉన్న ప్రఖ్యాతి గాంచిన జేపీదర్గాను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో మైనార్టీ నాయకులు చేపట్టిన మిలాద్ ఉన్ నబీ వేడుకల ర్యాలీలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు రవికుమార్‌గుప్తా, ఖాజా, బాబార్‌ఖాన్, సాదిక్, ఖాలేద్, మన్సూర్, షౌకత్, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంక్షేమానికి కృషి

సీడీపీఓ ఉదయ

షాద్‌నగర్: చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని సీడీపీఓ ఉదయ అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ బీ-పఢాయ్ బీ అనే పథకం పై మూడురోజుల శిక్షణా తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న చిన్నారుల ఆరోగ్య సంరక్షణతో పాటు విద్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి రోజు కనీసం రెండు గంటల పాటు ప్రీస్కూల్ బోధన అందిస్తున్నట్లు తెలిపారు. మానసిక, శారీరక దివ్యాంగులైన పిల్లలను గుర్తించి వారి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ శిక్షణా శిబిరాలు ఈ నెల 18 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సంధ్య, రేవతి, లక్ష్మీబాయి, దివ్య, జ్యోత్స్న, వెంకటమ్మ, గీత, పద్మ, జయ, శివరాణి, సమంత, ఆండాలు తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎస్‌ఐ శంకరయ్య

మొయినాబాద్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఎస్‌ఐ శంకరయ్య అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలను వేగంగా నడపకుండా నియంత్రణ పాటించాలన్నారు. అతివేగం, అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. వాహనాలు వేగంగా నడిపినా, రోడ్లపై పార్కు చేసినా, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపినా ఛలాన్లు పడతాయన్నారు. ఛలాన్లను ఎప్పటికప్పుడూ చెల్లించాలన్నారు. తనిఖీలు చేసిన వారిలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

ఎంపీడీఓ అరుంధతి



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో అధికారులు

కొత్తూరు: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని ఎంపీడీఓ అరుంధతి అన్నారు. పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఎంపికైన పలువురు ఉపాధ్యాయులను అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ అంగూర్‌నాయక్,మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధులు లేక.. పనులు సాగక

- అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణం
- మూడేళ్లుగా ముందుకు సాగని పనులు
- ప్రభుత్వం మారడంతోనే అంటూ సమాధానాలు
- పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణం

శంకర్‌పల్లి: సమీకృత మార్కెట్‌యార్డు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. రెండేళ్లలో పూర్తి కావాల్సిన పనులు మూడేళ్లయినా ముందుకు సాగడం లేదు. ప్రజల నిత్యావసరాలైన పండ్లు, కూరగాయలు, మాంసం ఇలా అన్ని ఒకేచోట విక్రయాలు సాగేలా అప్పటి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అన్ని మున్సిపాలిటీలు, పట్టణాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా శంకర్‌పల్లి పట్టణంలో రూ.2కోట్ల నిధులతో సమీకృత మార్కెట్ యార్డు పనులను ప్రారంభించింది. ప్రస్తుతం నిధులు లేక మార్కెట్ యార్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

ఒకేచోట క్రయవిక్రయాలు జరిగేలా..

మున్సిపాలిటీల్లో ఒకేచోట క్రయవిక్రయాలు కొనసాగేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్‌యార్డుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే శంకర్‌పల్లి మున్సిపల్‌లో 30 గుంటల భూమి కేటాయించి, రూ.2కోట్ల నిధులతో 2021 జూన్‌లో అప్పటి మంత్రి సబితారెడ్డి సమీకృత మార్కెట్ యార్డు పనులకు శంకుస్థాపన చేశారు. కాగా, మొదట్లో చకచకా పనులుసాగినా .. ఆపై వేగం మందగించింది.

మొదటి నుంచి అడ్డంకులే..

శంకర్‌పల్లి పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణానికి మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులకు మొదటి నుంచి అడ్డంకులే వచ్చాయి. దానికి గల ప్రధాన కారణం మున్సిపాలిటీకి ఒక ఎకరా ప్రభుత్వ స్థలం కూడా లేకపోవడమే. దీంతో మార్కెట్‌యార్డు నిర్మించేందుకు అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. అప్పటి మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్ అండ్‌బీ అధికారులతో మాట్లాడగా.. పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలోని 30 గుంటల భూమిని కేటాయించారు. అయితే ఈ స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించే సమయంలోనూ ఆర్‌అండ్‌బీ అధికారులు కాస్తా ఇబ్బందికర పరిస్థితులకు గురిచేశారు.

రెండు బ్లాకులుగా నిర్మాణాలు

పట్టణంలో నిర్మించే ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డును వెజ్ బ్లాకుగా ఒకటి, మరొకటి నాన్‌వెజ్ బ్లాకుగా విభజించారు. అయితే ఈ రెండు బ్లాకులలో మొత్తంగా సుమారు 80 నుంచి 100 యూనిట్లు వచ్చే అవకాశం ఉంది. వీటిని పండ్లు, కూరగాయలు, మాంసం విక్రయదారులకు కేటాయిస్తారు. అయితే 2021 జూన్‌లో శంకుస్థాపన అయినప్పటి నుంచి వెజ్‌బ్లాకులో ఒక అంతస్తు నిర్మాణం వరకు పూర్తికాగా.. మరొక అంతస్తు నిర్మాణం పెండింగ్‌లో ఉంది. అదే నాన్‌వెజ్ బ్లాకులో మాత్రం పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పెద్దఎత్తున గడ్డి, చెత్తాచెదారం నిండి, పశువులు, శునకాలకు ఆవాసంగా మారింది.

నిధుల కొరతతోనే..

నిధుల కొరతతోనే మార్కెట్ యార్డు నిర్మాణం పూర్తి కావడం లేదని సమాచారం. సమీకృత మార్కెట్ నిర్మాణానికి ప్రారంభంలో రూ.2కోట్ల నిధులు కేటాయించగా, మంజూరైన నిధులతో కాంట్రాక్టర్ అయినంత వరకూ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో మార్కెట్ యార్డు నిర్మాణ పనులు ఆదిలోనే శిథిలావస్థలోకి వెళ్లే పరిస్థితి నెలకొంది. రూ.కోటి నిధులు మంజూరైతే గానీ పనులు పూర్తయ్యేలా లేవు. ఇప్పటికైనా అధికారులు శ్రద్ధ వహించి నిర్మాణాన్ని పూర్తిచేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌ను వివరణ కోరగా.. నిధుల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తామని ఆయన తెలిపారు.

> **త్వరగా పనులు పూర్తిచేయాలి**
>
> ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు పూర్తయితే పట్టణ వాసులకు భారీస్థాయిలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయి. ప్రస్తుతం మార్కెట్ పట్టణ చౌరస్తా సమీపంలోనే జరుగుతోంది. దీంతో నిత్యం ట్రాఫిక్‌తో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు చొరవ తీసుకొని త్వరతగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.
>
> –బాలకృష్ణారెడ్డి, సింగాపూర్

నేడు జాతీయ పతకావిష్కరణ

కొత్తూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం 9.45 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు ఎంపీడీఓ అరుంధతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రత్యేకాధికారులు, గ్రామ పెద్దలు పాల్గొని, విజయవంతం చేయాలని ఆమె కోరారు.

బీసీల హక్కుల సాధనకు పోరాటం

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



గ్రామ కమిటీ అధ్యక్షుడు పత్తి శంకర్‌కు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణ

షాబాద్: బీసీల హక్కుల సాధనకు నిరంతర పోరాటం చేస్తామని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మక్తగూడలో బీసీ సేన గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా పత్తి శంకర్, ఉపాధ్యక్షుడిగా కాషనోళ్ల శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గోవుల అంజయ్య, కోశాధికారిగా గోవుల నర్సింలు, ప్రచార కార్యదర్శిగా పత్తి ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ధ్యేయంతో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. బీసీ వర్గాలపై రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే గ్రామస్థాయి నుంచే బీసీలు ఏకతాటిపైకి రావాలని సూచించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సేన మండల అధ్యక్షుడు దయాకర్‌చారి, ఉపాధ్యక్షుడు మీరంపల్లి బాలరాజ్, షాబాద్ మండల బీసీసేన యువజన అధ్యక్షుడు అజయ్‌కుమార్, నాయకులు పాలమాకుల ఆనంద్, తిరుపతి, రాజేందర్‌గౌడ్, యాదగిరి, చంద్రశేఖర్‌చారి, మాధవచారి, మహేందర్, లింగం, ప్రసాద్, బోకుల మల్లేశ్, సత్యనారాయణచారి, భూషణ్‌చారి, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని అయ్యప్ప, ఆర్టీసీ కాలనీల్లో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.80లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్ల నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందని స్పష్టం చేశారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి నిరుపేదలకు వరం

నందిగామ: కల్యాణలక్ష్మి పథకం నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్‌కు చెందిన కల్వకోల్ పావనికి ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కును మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, నాయకులు జ్ఞానేశ్వర్, కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, జింకల జంగయ్య, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



మాట్లాడుతున్న రాజు

షాబాద్: గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజు, ఎం.చంద్రమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని నాగర్‌గూడ పీఎస్ఆర్ గార్డెన్‌లో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అధ్యక్షతన జీపీ కార్మికుల 5వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీపీ కార్మికులు ప్రాణాలు ఫణంగా పెట్టి పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారని, అయినా వారిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే కార్మికులకు ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం గ్రామపంచాయతీ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన జీపీ యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎస్. రాజు, ప్రధాన కార్యదర్శిగా గ్యార పాండు, కోశాధికారిగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా అల్లి దేవేందర్, దేవదాస్ బేగరి యాదయ్య, రాంచంద్రయ్య, నర్సింహ, రాంచంద్రయ్య, సహాయ కార్యదర్శులుగా జంగయ్య, సత్తయ్య, సరిత, లక్ష్మణ్‌నాయక్ 27 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జీపీ యూనియన్ మండల అధ్యక్షుడు సత్తయ్య, ఉపాధ్యక్షుడు అర్జున్, చేవెళ్ల మండల అధ్యక్షుడు నర్సింహ, కార్యదర్శి సీహెచ్ మల్లయ్య, శంకర్‌పల్లి మండల కార్యదర్శి నరసన్నల సుజాత, మొయినాబాద్ మండల నాయకుడు పాండు, చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాల కార్మికులు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాద్‌నగర్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పట్టణంలోని అన్ని కాలనీలతో పాటు ఫరూఖ్‌నగర్, నాగులపల్లి, రాసుమల్లగూడ, సోలీపూర్ గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో పట్టణ ఏఈ వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పరిశ్రమల ద్వారా వెలువడుతున్న కాలుష్యం

దెబ్బతింటున్న పంట పొలాలు



కొందుర్గు శివారులో ఎర్రబడిన వరిపైరు

కొందుర్గు: పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పచ్చని పంటలు దెబ్బతింటున్నాయని పలువురు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొందుర్గు శివారులోని ఐరన్, పేపర్, బట్టల, బ్యాటరీల తయారీ పరిశ్రమల నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ, వ్యర్థాలతో వాతావరణంతో పాటు నీటి కాలుష్యం ఏర్పడుతోందని వాపోతున్నారు. పొగతో పచ్చని పంటలకు అనేక తెగుళ్లు వస్తున్నాయని, వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలు దెబ్బతింటున్నాయని ఆరోపిస్తున్నారు. కొందుర్గు శివారులోని శ్యామ్ గోదావరి స్మెల్టర్స్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగతో తన వరిచేను ఎర్రబడిందని రైతు రాయికంటి వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నాడు.



విద్యతోనే ఉజ్వల భవిష్యత్

వాసవి క్లబ్ అధ్యక్షుడు కల్వ మాణిక్యం



విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను అందజేస్తున్న క్లబ్ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: ఉన్నత విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వాసవి క్లబ్ అధ్యక్షుడు కల్వ మాణిక్యం అన్నారు. మంగళవారం వాసవి, వనితా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌పీ గ్యాస్ డీలర్ ఇల్లూరి శ్రీనివాసబాబు, రూపాదేవి దంపతుల సహకారంతో ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేశారు. పేద విద్యార్థుల తమవంతుగా సహకారాలు అందిస్తున్నామన్నారు. విద్యార్థులు దాతల అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ గుడుపల్లి వెంకటరమణ, వనితా క్లబ్ కోశాధికారి పాపిశెట్టి స్వప్న, జోన్ చైర్‌పర్సన్ కొండ రమాదేవి, విశ్రాంత ఉపాధ్యాయులు శ్యామల, ప్రేమకళ, మాజీ వార్డుసభ్యుడు నర్సింలు, హెచ్‌ఎం సక్కుబాయి, ఉపాధ్యాయులు కృష్ణమ్మ, రేణుక, స్వప్న, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎంపీడీఓ హిమబిందు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ హిమబిందు

చేవెళ్ల: విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా, రుచికరంగా ఉండేలా కృషి చేయాలని ఎంపీడీఓ హిమబిందు అన్నారు. మండలంలోని రావులపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలకు అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం వస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి భోజనంపై ఆరా తీశారు. అక్షయపాత్ర నుంచి ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కొందుర్గు తహసీల్దార్‌గా మహ్మద్ అజాం అలీ



కొందుర్గు: కొందుర్గు తహసీల్దార్‌గా మహ్మద్ అజాం అలీ బదిలీపై వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ పనిచేసిన రమేశ్‌కుమార్ ఇరవై రోజుల క్రితం తలకొండపల్లికి బదిలీపై వెళ్లారు. అదే సమయంలో కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రాజేందర్‌రెడ్డిని కొందుర్గుకు బదిలీ చేయగా.. ఆయన విధుల్లో చేరలేదు. కాగా ఎమ్మెల్యే ప్రతిపాదన మేరకు రాజేందర్‌రెడ్డిని కేశంపేట తహసీల్దార్‌గా బదిలీచేస్తూ, అక్కడ పనిచేస్తున్న మహ్మద్ అజాం అలీని కొందుర్గు తహసీల్దార్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

పల్లెల అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ముడిమ్యాలలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: పల్లెల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం స్థానిక నాయులతో కలిసి ఆయన మండలంలోని లక్ష్మీగూడలో రూ.25 లక్షలు, గుండాలలో రూ.25 లక్షలు, సాయిరెడ్డిగూడలో రూ.5 లక్షలు, అల్లవాడలో రూ.15 లక్షలు, చనువెల్లిలో రూ.40 లక్షలు, గొల్లపల్లిలో రూ.15 లక్షలు, ధర్మసాగర్‌లో రూ.15 లక్షలు, కుమ్మెరలో రూ.15 లక్షలు, రావుపల్లిలో రూ.25 లక్షలు, ముడిమ్యాలలో రూ.45 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్లు, వీధిలైట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇంకా మండలంలోని లింక్‌రోడ్లు, బీటీరోడ్ల అభివృద్ధి నిధులు మంజూరు చేస్తుందన్నారు. పింఛన్‌దారుల సమస్యను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని, త్వరలోనే కొత్త పింఛన్లు వస్తాయని స్పష్టం చేశారు. ముడిమ్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దాత పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, సరిత దంపతులు యూనిఫాం, స్పోర్ట్స్ డ్రెస్, షూస్‌లను అందించగా.. వాటిని ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, సీనియర్ జిల్లా, నియోజకవర్గ నాయకులు ఆగిరెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, సరిత, దావాల్‌గారి గోపాల్‌రెడ్డి, జె.పాండుగౌడ్, కె. శ్రీనివాస్, కందికొండ లక్ష్మణ్‌గౌడ్, ఎల్. శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, పి.ప్రభాకర్, రాంచంద్రయ్యగౌడ్, పడాల రాములు, శ్రీనివాస్‌గౌడ్, సాయినాథ్, కె.నరేందర్, వాజిద్, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పీఆర్‌డీఈ గణేశ్, ఎంపీడీఓ హిమబిందు, ఏఈ ప్రభాకర్, గీత స్రవంతి, మండల నాయకులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చూసి ఆకర్శితులై చేరికలు

చేవెళ్ల: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఇతర పార్టీలు ఆకర్శితులై పార్టీలోకి వస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని ముడిమ్యాలలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు గ్రామ నాయకులు, కార్యకర్తలు పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్నారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసుకుంటూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, బీసీ సెల్ నాయకులు సూర్యపేట శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు స్వరూప, సుమలత, సీనియర్ నాయకులు సాయినాథ్, హరికిషన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పడాల రాములు, నర్సింలు, దుర్గేశ్, జంగారెడ్డి, సత్యనారాయణ, మహేందర్, జనార్దన్, మైనార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.